• ఆదివారం ఆంధ్రజ్యోతి. జనవరి 2, 2005

# ఊరట

తుళ్లిపడి లేచి కళ్లు తెరిచింది గాయత్రి. గదిలో ఎవరూ లేరు. గోడ గడియారం వంక చూసింది. ఆరున్నర. నిద్ర చాలని కళ్లు బరువుగా అనిపించాయి. మంచం మీంచి కాళ్లు కింద పెట్టింది. చుట్టూరా సామాన్లు పరిచినట్లు వున్నాయి. ఆ సామాను మధ్య తనూ ఓ సామానులానే వుంది.

లేచి, వీధి వైపునున్న కిటికీ రెక్క ఓరగా తెరిచి చూసింది. రాత్రి కురిసిన వర్షం మాయమై తూర్పు వైపు నుంచి ఎండ పొడ పల్చగా పరుచుకుంటోంది. తాటాకు పందిరి చూరుల్లోంచి మెరుస్తూ జారుతున్న నీటిబిందువులు-

రాత్రి కురిసిన వర్షం మరింత ఉధృతమై ఊరిలోకొచ్చే మార్గాలన్నీ మూసుకుపోతే..? అలా జరిగితే బాగుండుననుకుంది రాత్రి.

అలాగే జరిగితే అది తన సమస్యకు పరిష్కారమైతుందా! పాపం నాన్న! ఆ వర్షానికే ఎంత తల్లడిల్లిపోయాడో. అంతా సవ్యంగా జరగాలని ఎన్ని మొక్కులు మొక్కుకున్నాడో.

రాత్రి వచ్చిన కల గుర్తొచ్చింది గాయత్రికి. నిద్రలోనే అది ఎంత భయాందోళనకు గురి చేసిందో. తెల్లారగట్ట కన్న కలలు కొన్నయినా నిజమౌతాయంటారు. ఇది నిశ్చయంగా తెల్లారగట్ట వచ్చిన కలే!

తామంతా ఎక్కడ్నుంచో ఎక్కడికో వెళ్తున్నారు– ముందు పడవలో పెద్దక్క, బావ, పిల్లలూ – ఆ నది గోదావరేనేమో.. పొంగి పొరలుతోంది. వరద గోదావరి ప్రళయగోదావరిగా మారకముందే వెళ్లిపోవాలి– అంటున్నారెవరో. తర్వాత వచ్చిన పడవ జనంతో నిండి వుంది. 'ఒక్కరికే.. ఒక్కరికే చోటుంది' అంటున్నాడు పడవ సరంగు.

'ముందు నువ్వెళ్లిపో' అంటూ తననెక్కించాడు నాన్న. అతనొక్కడే మిగిలిపోతూ. 'నీతోనే వుంటాను నాన్నా' అంటూ కన్నీళ్లు పెట్టుకుని ఏడ్చింది తను– పడవ కదిలింది.

'ఎవర్రా అక్కడ? ఆ యింటి గదులన్నీ వూడ్పించి నీళ్లు పట్టి వుంచేరా? తండ్రి కేక విన్పించి అటువైపు చూసింది గాయత్రి. మాసి నలిగిపోయిన చొక్కా, పంచ, మాసిన గడ్డమూ, అలసిన కళ్లూ – అరవై రెండేళ్లవాడూ డెబ్బయ్ రెండేళ్ల వాడిలా వున్నాడు. ఆనందమూ అశక్తతా రెండు కళ్లలోనూ అంతో యింతో కన్పిస్తూనే ఉన్నాయి.

పిచ్చినాన్న! రేపట్నించీ యీ పాత డాబా ఇంట్లో ఒక్కడే వుంటాడు. తండ్రి పట్ల కలిగిన జాలీ దుఃఖం మనసంతా నిండిపోయాయి గాయత్రికి. రాత్రి ఆలోచనలే మళ్లీ తెరలు తెరలుగా –

పెరట్లోంచి బిందెల చప్పుళ్లూ, గిన్నెల చప్పుళ్లూ విన్పిస్తున్నాయి.

పెద్దక్క నిద్రపోయి ఉండదు. అసలీ హడావుడికంతటికీ కారణం ఆమే.

'మంచి సంబంధం కోసం యింకా ఎన్నాళ్లు ఎదురుచూస్తాం నాన్నా. దానికి పాతికేళ్లు దాటిపోయాయి. ఆ శుభకార్యమేదో చేసేసి గుండెల మీదున్న కుంపటిని దించేసుకో. ఆ బెంగతోనే నీ ఆరోగ్యం చెడింది. అది సరిచూసుకోవడం ముఖ్యం'

– ఈ మాటలే మళ్లీ మళ్లీ విన్పించేవి పెద్దక్క నోటంట.

పెద్దక్క పెళ్లి ఆమె పద్దెనిమిదో ఏటనే జరిగింది– బావగారికి కరణీకం, పోస్టుమాస్టర్‌గిరీ వున్నాయి. ఆ చిన్న పల్లెటూళ్లో అతనే ఓ పెద్ద. రెండేళ్లకో మూడేళ్లకో అక్క వచ్చి రెండో మూడో రోజులు వుండి వెళ్తుంది. వచ్చినప్పుడల్లా ఏదో ఒక రకంగా నాన్నకి బ్రెయిన్‌వాష్ తప్పదు.

కిటికీలోంచి చల్లగాలి తెరలు తోసుకుని లోపలి కొచ్చింది.

దుప్పటి మడతేసి, నవారు మంచాన్ని గోడకి చేరవేసి బాత్రూంలోకి నడిచింది గాయత్రి. బయట బేండువాళ్లు వచ్చి శ్రుతి చేసుకుంటున్న సందడి మొదలైంది.

పళ్లు తోముకుని బాత్రూం లోంచి వచ్చేసర్కి పెద్దక్క గదిలో వుంది.

'లేచేవూ.. తొరగా తెమలాలి మరి. ఒకరూ ఒకరూ వచ్చే వేళైంది. ఆ పాటికి నీ స్నానం కూడ అయిపోతే'.. అంటూ వాక్యం పూర్తి చేయకుండానే వంటింట్లోకి వెళ్లి స్టీలుగ్లాసుతో కాఫీ తీసుకొచ్చింది.

'నీకెందుకక్కా శ్రమ, నేనొస్తాగా'

'ఎందుకేమిటే పిచ్చిపిల్లా. రేపు నేనూ మీ బావ గారూ మీ యింటికొస్తే నువ్విలాగే మర్యాద చెయ్యొద్దూ?' అంటూ నవ్వి 'సేయ్.. సూరమ్మా యీ సామాన్లు ఒక్కొక్కటీ తీసుకెళ్లి వంటాయన దగ్గర పెట్టు' అంటూ పురమాయించింది.

సూరమ్మ అంటే ఆమె వస్తూ తెచ్చిన నమ్మకమైన పనిమనిషి.

గాయత్రి కాఫీ తాగడం పూర్తయ్యేసరికి గదిలోని సామాను బయటకు వెళ్లి వాటి స్థానంలో కొన్ని ప్లాస్టిక్ కుర్చీలు వచ్చేయి.

'ఈ తొమ్మిది గంటల బస్సులో వసంతావాళ్లూ వస్తున్నారు. అదే ముందుగా వచ్చి వుంటే నాకింత శ్రమ వుండేది కాదు. అయినా నేను చేసే పన్లు నేనే చెయ్యాలి. తప్పదు' అంటూ నుదుట పట్టిన చెమటను చీరకొంగుతో తుడుచుకుంది పెద్దక్క.

ముప్ఫయ్ ఆరేళ్ల పెద్దక్కకు అప్పుడే పెద్దరికం వచ్చేసింది. ఆరిందాలా మాట్లాడుతుంది. తనకు జీవితం నేర్పిన పాఠాన్ని నలుగురికీ నేర్పే ప్రయత్నం చేస్తూంటుంది. నాన్నకి సలహాలివ్వడంలోనూ ఆ పెద్దరికమే కన్పిస్తుంది.

వసంతక్క అంతా అమ్మ పోలిక అంటారు- అనడమేంటి నిజమంతే. మనిషి నెమ్మది... మాట నెమ్మది.. ఎవరినీ ఎదిరించి మాట్లాడని స్వభావం. చిన్న బావకి భిలాయ్‌లో ఉద్యోగం. ఏ నాలుగేళ్లకో ఓ మారు వస్తారు. ఓ నాల్రోజులుంటారు. అంతే.

'దాన్ని అంత కలిగిన కుటుంబంలో యివ్వలేక పోయాం' అని బాధపడేది అమ్మ అప్పట్లో. ఇప్పుడు అమ్మే ఉంటేనా?

గాయత్రి కళ్లలో వెచ్చని కన్నీరు ఉబికింది. అమ్మ వుంటే ఏం చేయగలిగేది? ఒకందుకు సంతోషించేది. మరొకందుకు తమ ఆర్థిక పరిస్థితిని తల్చుకుని బాధపడేది. తనకు మాత్రం యిప్పుడున్న యీ దిగులు ఉండేదికాదు. అది నిజం.

'నువ్వింకా యిలాగే వున్నావుటే? వస్తూనే ఆశ్చర్యంగా అడిగింది వరలక్ష్మి.

ఆమె చేతిలో ఓ చిన్న బుట్ట, దాన్నిండా వువ్వులూ వున్నాయి. వరలక్ష్మి గాయత్రితో చదువుకుంది-ఏడాదిన్నర క్రితం పెళ్లయిందామెకు. చేస్తున్న ఉద్యోగం ఆర్థికంగా సంతృప్తినివ్వకపోవడంతో ఆర్నెల్ల క్రితం వరలక్ష్మి భర్త దుబాయ్ వెళ్లేడు. అప్పట్నించీ వరలక్ష్మి యిక్కడే. పుట్టింట్లోనే ఉంది- మూడు రోజులుగా పెద్దక్కకు అన్ని పనుల్లోనూ సహాయంగా వుంటోంది. స్నేహమంటే అదేనేమో.

'నిన్న సాయంకాలం నీకిష్టమైన చుక్కలముగ్గు వేశాను. అది రాత్రి వర్షానికి కొట్టుకుపోయింది. మళ్లీ యిప్పుడు నాకు తోచిందేదో వేశాను' అంది వరలక్ష్మి.

ఒక్క ముగ్గేనా? తనకిష్టమైనవెన్నో అలా అయిపోయాయి.

చిన్నప్పట్నించీ అమ్మంటే యిష్టం. ఆమె లేకుండా పోయింది. చదువంటే యిష్టం– అది మధ్యలోనే ఆగిపోయింది. దూరవిద్య ద్వారానైనా డిగ్రీ పూర్తి చేయాలనుకుంటే.. యిప్పుడిదీ.

'నీళ్లు కాగేయి. రా' పెరట్లోంచి అక్క పిలిచింది.

గాయత్రి తలంటు పోసుకుని వచ్చే సర్కి పూలమాలను, రడీ చేసింది వరలక్ష్మి. కొత్త చీర కట్టుకున్నాక తల దువ్వి జడలో పువ్వులు పెట్టింది. అద్దంలో చూసుకుంటే కొత్తగా అన్పించింది గాయత్రికి. సరిగ్గా అప్పుడే గాయత్రి చిన్నక్క వసంత, పిల్లలూ, బావగారూ వచ్చారు. అందరి ముఖాల్లోనూ ఆనందమే. వాళ్లందరికీ స్నానాలు టిఫిన్లూ, కాఫీలూ ఏర్పాటు చేసింది పెద్దక్క. ఆమె యిదంతా ఓ పని అనుకోదు. సరదాగానే చేస్తుంది. బాధ్యతగా తలపోస్తుంది.

'నీ కాబోయే శ్రీవార్ని చూశానే' అంది వసంతక్క స్నానం చేసి టిఫిన్ ప్లేటుతో వచ్చి, గాయత్రి పక్కన కూర్చుంటూ.

ఎలా వున్నారో అక్క చెబుతుందేమోనని చూసింది గాయత్రి.

ఆమె అదేమీ చెప్పలేదు.

అత్తగారూ, అక్కగారూ, బావగారూ మరో పది మంది బంధువులూ – అంతా మాతోనే వచ్చారు. మంచివాళ్లలాగే వున్నారు' అంది.

అవును మరి తమవంటి వారికి గుణంతోనే కాని రూపంతో పనిలేదు.

'దానికి తగ్గ అందగాడు కాదుగానీ అతని మాటల్ని బట్టి గుణవంతుడే అనిపిస్తోంది– ఆ తర్వాత దాని అదృష్టం. నా తాహకుకు యింత కంటె మంచి సంబంధం తేలేనేమో' నాలుగు రోజులనాడు ఏదో సందర్భంలో నాన్న పెద్దక్కతో అన్న మాటలు వింది గాయత్రి. ఆ మాటలు గుర్తొచ్చాయి.

'మీ బావలిద్దరికీ కాఫీలు తీసుకెళ్లి యివ్వవే గాయత్రీ' అంది పెద్దక్క గుమ్మంలోకొచ్చి–

'దాన్నెందుకు వీధిలోకి పంపడం? నే తీసుకెళ్తాలే' అంటూ లేచి వెళ్లింది వసంతక్క

నాన్నకి రెండోమాటు టీ తాగే అలవాటు. తాగేడో లేదో. అక్కడ ఆ మాట అనడానికి జంకింది గాయత్రి. అయినా యీ రోజంటే తను చూస్తుందేమోగాని రేపట్నించీ నాన్న అవసరాలను ఎవరు కనుక్కుంటారు? వచ్చిన దగ్గర్నించీ చూస్తోంది– పెద్దక్క నోటంట

ఆ మాట తప్ప అన్నీ వస్తున్నాయి. వసంతక్కకు మనసులో వున్నా బయటపెట్టలేదు. ఒకవేళ బయట పెట్టినా అక్కడసాగదు– ఆ యిల్లు వాళ్ల సంసారానికే చాలదు. ఇంత విశాలంగా మసలిన నాన్న అక్కడకు వెళ్లి ఎక్కడుంటాడు?

మరో గంట గడిచింది. కామేశం మావయ్యా, జానకత్తా యింటి ముందు రిక్షా దిగేరు. మావయ్యను చూసి ఏ నాలుగేళ్లో అయింది. అప్పుడు విశాఖపట్నం ఏదో ఆఫీసు పని మీద వెళ్తూ మధ్యలో దిగేడు. అమ్మ పోయాక అది రెండో మూరో మూడో మూరో మావయ్య రావడం. జానకత్తనైతే చాలా ఏళ్లే అయింది చూసి. జానకత్త తెలివైనది. మాటలతో బాణాలు వెయ్యగలదు– తల్లిపోయిన ఆడపిల్లలని జాలిపడి వాళ్లకి ఏం జారేస్తాడోనని భర్త పట్ల ఆమెకు భయం. అందుకే కనపడని రిమోట్‌తో మావయ్యని కంట్రోలు చేస్తుంటుంది. మావయ్య కూడా తామరాకు మీది నీటి బొట్టులానే వుంటాడు. ఇల్లరికపుటల్లుడిలా అత్తా మామలకు సేవ చెయ్యడమే గాని మరొకటి తెలియదాయనకి. ఉన్న ఒక్క ఆడపిల్లకూ పెళ్లి చేసి సింగపూర్ పంపించేశారు. దేశ సరిహద్దులు దాటి తన పిల్ల వెళ్లడం జానకత్తకు గొప్ప.

'ఏమిటి బావా, బొత్తిగా అలా అయిపోయావు' అంటున్నాడు మావయ్య ఎదురెళ్లి ఆహ్వానించిన నాన్నతో.

నాన్న నీర్సంగా నవ్వి వూరుకున్నాడు. పెద్దక్క, వసంతక్క వచ్చారు. పలకరింపులవుతున్నాయి. వీధిలోకి వెళ్లిపోతున్న నాన్న వెనుకే నాలుగడుగులు వేగంగా వేసి 'నువ్వు స్నానం చేసి బట్టలు మార్చుకోకూడదూ' అంది గాయత్రి నెమ్మదిగా అతనికి మాత్రమే వినిపించేలా.

'అలాగే లేమ్మా' అన్నాడాయన ముందుకు కదుల్తూ.

'టీ తీసుకురానా' అంది యిక వుండలేక.

'తాగేనులే. నువ్వెళ్లు లోపలికి' అన్నాడాయన నవ్వి.

◆ ❖ ◆

మధ్యాహ్నం పన్నెండున్నర గంటలు దాటింది– పందిట్లో విస్తళ్లు వేసే తతంగం మొదలైంది. ఎవరెవరో.. ఎక్కడెక్కడి బంధువులూ, స్నేహితులూ, చుట్టుప్రక్కల యిళ్ల వాళ్లూ వచ్చి చేరుతున్నారు. ఇస్త్రీ చేసిన తెల్ల పంచె, లాల్చీ వేసుకున్న నాన్న అందర్నీ అప్యాయంగా పలకరిస్తున్నాడు – అందరికీ భోజనాలు ఏర్పాటయ్యాయి. ఆర్థికంగా బలహీనుడైన నాన్నకి యీ భోజనాల తంతు తలకు మించినదే–

"అంతమందిని ఎందుకు నాన్నా పిలవడం" అని అంటే ఒప్పుకోలేదాయన.

'మీ అమ్మ వుండగా యిద్దరక్కలకీ ఘనంగానే పెళ్లి చేశాను. కడసారి దానివి నీకు లోటు చేస్తానా' అన్నాడు. తనేం మాట్లాడలేకపోయిందానాడు.

వీళ్లలో ఎవరైనా నాన్న పరిస్థితి గురించి ఆలోచించిన వాళ్లున్నారా? నాన్న సమస్యల్లో పాలు పంచుకుని కనీసం సలహాలిచ్చే వాళ్లయినా యిందులో లేరు. ఈ ఆడంబరాలన్నీ ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమా అన్పించింది గాయత్రికి.

మరో రెండు గంటల్లో పందిట్లో సందడి తగ్గింది- ఇంటికొచ్చిన బంధువులు వాళ్లకి కేటాయించిన గదుల్లో సర్దుకున్నారు- కొందరు తీరిగ్గా కునుకు తీస్తున్నారు. బంధువుల కోసం ప్రక్కనే ఖాళీగా ఉన్న బేంకు మేనేజర్‌గారి యిల్లు రెండురోజులకని అడిగి తీసుకున్నాడు నాన్న.

ఇంతలో 'ఎవరొచ్చారో చూడవే' అంటూ వచ్చింది వరలక్ష్మి.

ఎర్రగా పొడుగ్గా ఫేషన్‌గా కత్తిరించిన జుట్టుతో వస్తున్నామె వంక చూసింది గాయత్రి.

'హేయ్.. కంగ్రాచులేషన్స్. పోల్చావా' అంది సమీర లోపలికొచ్చి.

సమీర ప్లీడరుగారమ్మాయి. గాయత్రితో పాటు చదువుకుంది. అందమూ, అదృష్టమూ, తెలివితేటలూ కలగలిసిన అమ్మాయని అప్పట్లోనే పేరుపడింది.

'ఎన్నాళ్లకి చూశానే' అంది గాయత్రి ఆనందంగా లేచి వెళ్లి.

'రియల్లీ.. వాట్ ఎ సర్‌ప్రైజ్. ఇక్కడికొచ్చాకే తెల్సింది. నేనూ వస్తానని అనుకోలేదు- అమ్మావాళ్లని చూసి అయిదేళ్లయిపోయింది గదా. ఇదిగో.. వీడు పుట్టినప్పుడు వచ్చారు వాళ్లు అమెరికా." అంది తనతో తీసుకొచ్చిన అయిదేళ్ల కొడుకుని చూపిస్తూ.

'టూ యియర్స్‌గా మా బాస్‌ని లీవ్ కోసం అడుగుతుంటే సడన్‌గా యిప్పుడు శాంక్షన్ చేసి వెళ్లిరమ్మన్నాడు. నాకు యిండియా వస్తే ట్వంటీ డేస్ సరిపోతాయా చెప్పు. ఇక్కడ హౌస్ రిపేరు చేయించాలనుకుంటున్నారు నాన్న. నాన్నకి హెల్ప్‌గా వుండాలా మరి? వచ్చేవరకూ ఎయిర్ టికెట్స్ కోసం టెన్షనే."

గుక్క తిప్పుకోకుండా మాట్లాడుతున్న సమీర వంక రెప్ప వేయకుండా చూస్తోంది గాయత్రి.. ఎంతలా మారిపోయింది మనిషి. అందంగా.. బారెడు జడతో వుండేది. పరికిణీలు వేసిన్నాడూ, చీర కట్టిన్నాడూ పట్టువే తప్ప మరొకటి కట్టలేదు- అటువంటిది పాంటూ, టీ షర్టూ, మెళ్లో సన్నని గొలుసూ చెవులకు చిన్న చిన్న డైమండ్ దుద్దులూ- భాష కూడా మారిపోయింది. ఆమె వచ్చిందని తెల్సి మరో నలుగురు స్నేహితురాళ్లూ వచ్చారు.

'అది సరే.. నీ భాషేంటే బాబూ.. అలా మారిపోయింది' అంది బేంకు మేనేజర్ గారమ్మాయి కీర్తన.

'ఇంకా నయం. నేను యీ భాషన్నా మాట్లాడుతున్నాను. మా బుజ్జిగాడికైతే తెలుగే రాదు. ఇంట్లో మేం మాట్లాడుకోడం కూడా యిష్టం వుండదు వాడికి. కదరా' అంటూ గొప్పగా కొడుకు వంక చూసింది.

'మనం ఎక్కడ వున్నా మన మాతృభాషను మర్చిపోకూడదు. తల్లి పిల్లలకి చెప్పే భాష మాతృభాష. హృదయభాష. మీ వాడికి తెలుగు రాదంటే ఆ తప్పు నీదే' అంది కీర్తన.

'ఓకే.. ఓకే' అంటూ గాయత్రి వంక తిరిగి 'బై దిబై.. నువ్వు మాత్రం అప్పటికీ యిప్పటికీ ఒకేలా వున్నావే. మార్పులేదు' అంది సమీర కూర్చుంటూ.

'మార్పుంటే మాత్రం? ... నీకేం... నీ అంత అదృష్టవంతులెవరూ' అంది కీర్తన.

'ఏం అదృష్టమో! చిన్నప్పుడే బావతో పెళ్లి, అమెరికాలో సెటిలవడం. డబ్బుంటావా... ఇక్కడ రూపాయెంతో అక్కడ డాలరూ అంతే. అక్కడ్నించి డాలరు తెచ్చుకుంటేనే యిక్కడ విలువ. మా బావ చేసేది సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే అయినా ఎప్పటికప్పుడే శుక్రవారమంటే భయం.'

'ఏం? శ్రావణ శుక్రవారం నోముల్లాంటి వేమున్నా చేయమంటారా'

'శని ఆదివారాలు సెలవులు గదా. శుక్రవారం సాయంకాలం పనిచేసే కంపెనీ యితగాని ఉద్యోగానికి ఉద్వాసన పలికే ప్రమాదముంది. అందుకని' తాపీగా చెప్పింది. ఎవ్వరూ ఒక్క క్షణం మాట్లాడలేదు.

'అభద్రతా భావం అన్నమాట- అదిక్కడ ప్రాణాలకే ఏర్పడుతోంది ఇప్పుడిప్పుడు' అంది కీర్తన.

'బంధువులకు దూరమై కేవలం డబ్బు సంపాదన కోసం జీవితాన్ని పరదేశంలో గడపడం నాకైతే నచ్చదు. అయితే ఏం చేస్తాం? నా బతుకు మా బావతో ముడిపడిపోయింది. మా వాళ్లకి ఆర్థికంగా సాయం చేయగలుగుతున్నానన్న తృప్తి మాత్రం వుంది. అక్కడ్నించి ఏ చిన్న బహుమతి తెచ్చినా యిక్కడి బంధువులకు ఆనందమే' అంది సమీర.

వాళ్లంతా నాలుగు మాటలు మాట్లాడి వెళ్లిపోయాక వారి గురించే ఆలోచిస్తూ ఉండిపోయింది గాయత్రి చాలా సేపు.

◆ ❖ ◆

పెళ్లిపందిరంతా దీపాలతో వెలిగిపోతోంది. పెళ్లికొచ్చిన బంధుమిత్రుల ముఖాల్లోనూ ఆనందం వెలిగిపోతోంది.

'పందిట్లో పెళ్లవుతున్నాదీ...' పాత పాటనే కొత్తగా వాయిస్తున్నారు బేండువాళ్లు.

గాయత్రి మనసులోని దిగులు ఆమె కళ్లలో ద్యోతకమౌతుండగా పెళ్లి పీటల మీద కూర్చుంది.

'కాకి ముక్కుకు దొండపండు' అనే సామెతే మోటుగా విన్పించింది.

అడ్డంగా కట్టిన తెరసెల్లా గాలికి వూగుతుంటే పందిట్లోకి చూసింది గాయత్రి.

దూరంగా నాన్న. అంతమందిలోనూ వంటరిగా అలసటగా వున్నాడు.

అందర్నీ పలకరిస్తూ కుర్చీల్లో కూర్చోబెడుతున్నాడు.

అమ్మే వుంటే నాన్నకెంత ధైర్యంగా వుండేదో! అమ్మే వుంటే నాన్న గురించి తనకీ బెంగంతా ఎందుకూ? తనుకు తానే సర్ది చెప్పుకుంది గాయత్రి.

మంగళవాద్యాలు మ్రోగేయి. అక్క బావ, నాన్న... ఒకరి తర్వాత ఒకరు పాలలో ముంచిన తన అరచేతుల్ని ఆయన చేతుల్లో వుంచుతున్నారు- తంతు పూర్తయ్యాక త్రివేది చేతుల్లో తన చేతులు పూర్తిగా యిమిడిపోయాయి.

◆ ❖ ◆

ఇంటి ముందు అద్దెకారు వచ్చి ఆగింది. ఎప్పటిదో అమ్మ తాలూకు పాత ట్రంకుపెట్టె, నాన్న తన కోసం కొత్తగా సూట్‌కేస్- అన్నీ డిక్కీలో సర్దిపెట్టారు.

త్రివేది వెంటే లేచి అడుగులు వేయడం కొత్తగా అన్పించింది గాయత్రికి. పెద్దక్క బావల వంక చూసింది. 'భయం లేదు వెళ్లిరా' అన్నట్లు పెద్దక్క తల నిమిరింది.

వసంతక్క తన రెండు చేతుల్నీ చేతుల్లోకి తీసుకుని నొక్కి వదిలింది.

నాన్న ఒక అడుగు ముందుకు వేశాడు - ఆయన వంక చూస్తే గుండెల్లోంచి దుఃఖం కళ్లల్లోకి పొంగుకొచ్చింది గాయత్రికి. కారు దాకా నడిచి వెళ్లారు అంతా. కారు వెనుక డోరు తెరిస్తే, ఆగి వెనుక్కు చూసి 'వస్తాం మావయ్యగారూ' అన్నాడు త్రివేది నాన్నతో. నాన్న ముఖంలో అప్పటివరకూ లేని దిగులు.

'ఆఖరిది కాబట్టి ముద్దుగా పెరిగింది నాయనా. ఎలా చూసుకుంటావో నీదే భారం' అన్నాడు వణికే గొంతుతో. ఆయన కళ్లలో ఎన్నడూ చూడని కన్నీరు.

'మీకా భయం అక్కర్లేదు మావయ్యగారూ. గాయత్రి ఇక్కడలానే అక్కడా వుంటుంది. కాకపోతే మరో స్థానంలో మరో హోదాలో. అయినా మీరొక్కరే యిక్కడ వంటరిగా వుండేకన్నా మాతో పాటే వచ్చి వుండొచ్చుగా.'

త్రివేది మాటకు నిశ్చేష్టురాలైంది గాయత్రి. అతని నోటంట వచ్చిన ఆ మాటలు అమృతతుల్యంలా తోచాయి. అటువంటి మాటను ఆమె అంత త్వరగా ఊహించలేదు- అవి అతని నోటంట కాక హృదయకుహరం లోంచి వచ్చినవిగానే తోచాయామెకు.

కన్నీళ్లు చెక్కిళ్లపై నుండి ధారలుగా కారుతూంటే త్రివేది కళ్లలోకి ఆనందంగా చూసింది గాయత్రి.

అతని కళ్లు నవ్వుతున్నాయి!

కళ్లు తుడుచుకుని ఆనందంగా కారులోకి అడుగుపెట్టింది.

◆ ❖ ◆